ప్రజాశక్తి

బుధవారం 20 మార్చి 2024 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







వీక్షణ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ రంజిత్‌బాషా

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని


పటిష్టంగా అమలు చేయాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేయాలని, రాజకీయ పార్టీల ప్రచారాలను ప్రభుత్వ స్థలాల్లో అనుమతించరాదని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా స్పష్టం చేశారు. విజయవాడ నుండి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మంగళవారం వీక్షణ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా మాట్లాడుతూ జిల్లా సరిహద్దులలోని చెక్‌పోస్టల వద్ద వాహనాలపై నిఘా పెరగాలన్నారు. వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షణ చేయాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ బందాలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించాలన్నారు. ఎలక్ట్రానిక్ సీజర్ మేనేజ్మెంట్ విధానాన్ని విస్తత స్థాయిలో వినియోగించాలన్నారు. సి-విజిల్ యాప్ ద్వారా అందే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడం ముఖ్యమన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు పరచడంలో రాజీ పడొద్దన్నారు. ప్రభుత్వ ప్రాంగణాలు, వాణిజ్య స్థలాల్లో రాజకీయ ప్రకటనలకు సంబంధించిన హోర్డింగులు, పోస్టరులు, బ్యానర్లను అనుమతించరాదన్నారు. రాజకీయ పార్టీలకు నూతన అనుమతులు ఇచ్చే అంశాలలో అందరికీ సమాన హక్కులు, అవకాశాలు, పరిమతులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వీక్షణ సమావేశంలో జిల్లా నుంచి కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ సిహెచ్ శ్రీధర్, ఈఆర్‌ఓలు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ప్రలోభాల పర్వం..!



- ఓటు కోసం డబ్బు, మద్యంతో ప్రజల వద్దకు అభ్యర్థులు
- ఈ సారి ముందే మొదలైన కానుకల పంపిణీ
- ఆందోళన కలిగిస్తున్న ప్రధాన పార్టీల పోకడలు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఓటు కోసం అభ్యర్థులు పడుతున్న పాట్లు.. పార్టీల పోకడలూ ఆందోళన కలిగిస్తున్నాయి. జనం బాగు కోసమా? ప్రజాస్వామ్య వ్యవస్థను నాశనం చేయడానికా? అంటే ఇప్పుడు జరుగుతోన్న తతంగాలు ఎలా ఉన్నాయో చెప్పాల్సిన అవసరం లేదు. కాలు బయట పెడితే డబ్బేడబ్బు. ఊళ్లలోకి అభ్యర్థులు వెళ్లేసరికి కార్యకర్తలు అక్కడుండే పేదలకు మద్యం బాటిళ్లు ఇస్తున్నారు. ప్రచారానికో, సంప్రదింపులకో అభ్యర్థి వచ్చే ఊళ్లో ఇప్పుడు జనానికి భోజనాలు.. విందూవినోదాలతో సందడిగా మారుతోంది. ఈ ఖర్చంతా అభ్యర్థి భరించాల్సిందే.. అసంతృప్తిగా ఉన్న నేతలను బుజ్జగింపు పర్వాలకు భారీగా నజరానాలు అందుతున్నాయి. ఇవన్నీ ఒకెత్తయితే ముందుగానే ఈ సారి ఎంపిక చేసుకున్న కొందరికి కానులు ఇస్తున్నారు. షెడ్యూల్ రాకముందే మొదలైన ఈ కానుకల పంపిణీలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. ఎందుకూ పనికిరాని వంట సామగ్రిని తెచ్చారు. బాక్సులు ఇప్పుడు గోదాముల్లో దించి వాలంటీర్లకు, వార్డు కన్వీనర్లకు, సచివాలయాల్లో ఉన్న చిన్న చిన్న ఉద్యోగులందరికీ ఇచ్చేశారు. ఇవన్నీ యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎన్నికల కమిషన్ నియమించిన కమిటీలు ఎక్కడున్నాయన్నదే ప్రశ్న. నిఘా వ్యవస్థ నిద్రపోతోంది. నిత్యం సమావేశాలు పెట్టి నిబంధనలు పాటించాలని కలెక్టర్ పదేపదే హెచ్చరికలు చేస్తున్నారు. అవన్నీ తెల్లారేసరికి పత్రికల్లో రావడం తప్ప ఆచరణలో నిబంధనల అమలు ఎక్కడా కనిపించడం లేదు. ఈ సారి ఎన్నికల తీరు తెన్నులు చూస్తే జనం నాడి ఎవరికీ అంతు చిక్కలేదా? అనిపిస్తోంది. అధికారం నిలబెట్టుకునేందుకు వైసిపి, తిరిగి ఏదో రకంగా పొందేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీలు పాట్లు పడుతున్నాయి. ఇప్పుడు బిజెపి తోడు రావడంతో తెలుగుదేశం కూటమిగా మారింది. అటు పాలకపక్షం గానీ, ఇటు కూటమి అభ్యర్థులు గానీ జనానికి మంచిచేస్తే ఓటు ఎందుకు వేయరనే నమ్మకంలో కనిపించడం లేదు. ప్రధానంగా పాలకపక్షం సంక్షేమ ఎజెండాను దేశంలోనే ఎక్కడా లేదంటూ గణాంకాలు వెల్లడిస్తోంది. అన్ని పార్టీ బహిరంగసభల్లో బటన్ నొక్కితే ఏపే పథకాల కింద ఎన్ని రూ.కోట్లు అందాయో సిఎం జగన్ గణాంకాలు చదివేస్తున్నారు. ఇంత డబ్బు జనానికి ఇచ్చినట్లు చెబుతున్నారు. అయినా వైసిపి అభ్యర్థులు ఇపుడు జనం ఓట్లు ▶ 2లో

ముందుకు సాగని 'జలజీవన్'.!



- తాగునీటికి ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- జిల్లాకు మంజూరయిన పనులు 1,393..
- పూర్తయిన పనులు 257..
- జిల్లాలో ఇవ్వాల్సిన కుళాయిల లక్ష్యం 1,37,436..
- ఇచ్చిన కుళాయిలు 19,255..

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఇంటింటికీ సురక్షితమైన తాగునీరు అందించడమే లక్ష్యంగా జిల్లాలో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులు నత్తనడకన సాగాయి. జిల్లాలో ప్రతి ఇంటికీ 2024 నాటికి మంచినీటి కొళాయి కనెక్షన్లు ఇవ్వాలనే ధ్యేయంతో రూ.470 కోట్లు నిధులతో జిల్లాలో 1,403 పనులు మంజూరయ్యాయి. జిల్లాలో ఇవ్వాల్సిన కుళాయిల లక్ష్యం 1,37,436 కాగా 19,255 కుళాయిలు మాత్రమే ఇవ్వగలిగారు.

జిల్లాలో సముద్రతీర ప్రాంతం అధికంగా ఉంది. తీరప్రాంతంలోని ప్రజలు తాగునీటి సమస్యను దీర్ఘకాలంగా ఎదుర్కొంటూ వస్తున్నారు. దీంతో పాటు తీరప్రాంతంలో ఉన్న రొయ్యల చెరువుల కారణంగా, సముద్రంలో ఆటుపోట్ల కారణంగా తీరంలోని భూగర్భ జలాలు ఉప్పునీరుగా మారుతూ వచ్చాయి. ఈ సమస్య పరిష్కారం కోసం ఎగువ ప్రాంతంలో ఉన్న కొమ్మమూరు కాలువ, సాగర్ కాలువ ద్వారా వస్తున్న జలవనరులను సద్వినియోగం చేసుకుంటూ తాగునీటి అవసరాలను తీర్చాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన జలజీవన్ మిషన్ పనులను జిల్లా గ్రామీణ నీటి సరఫరా శాఖ నేతృత్వంలో చేపట్టారు. అయితే ప్రారంభం నుంచి సదరు పనుల్లో పురోగతి లేకుండా పోయింది. గ్రామీణ ప్రాంతాలకు తాగునీటిని అందించేందు కోసం జలజీవన్ మిషన్ ద్వారా జిల్లాలో రూ.470 కోట్ల నిధులతో 1,403 పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. 10 పనులు ప్రారంభంలోనే రద్దు కాగా 1393 పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో రూ.5 లక్షల లోపు విలువైన పనులను నామినేషన్ పద్ధతి నాడు-నేడు తరహాలో చేపట్టే అవకాశం ఉన్న నేపథ్యంలో 959 పనులను ఈ పద్ధతిలో చేపట్టాలనుకున్నారు. దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారులో విపరీత జాప్యం నెలకొంది. దీంతో పాటు గ్రామాల్లో ఎక్కడా కూడా ఎవరూ ఈ పనులు చేపట్టేందుకు ముందుకు రాకపోవడంతో 959 పనులు నిలచిపోయాయి. ఇవన్నీ రద్దుల పద్దులో చేరినట్లయ్యింది. మిగిలి ఉన్న 434 పనులు చేపట్టాల్సి ఉండగా ఇందులో నాలుగు ఆదిలోనే రద్దయ్యాయి. 430 పనులు చేపట్టారు. గడిచిన మూడేళ్ల కాలంలో 257 పనులు పూర్తయ్యాయి. 177 పనులు వివిధ దశల్లో ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన ఈ పథకాల ద్వారా గ్రామీణప్రాంత ప్రజలకు మంచినీటి కుళాయిల ద్వారా తాగునీరు లభించాల్సి ఉంది. దీంతో పాటు నూతనంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలకు కూడా జల్‌జీవన్ మిషన్ ద్వారా తాగునీరు చేరాల్సి ఉంది. జిల్లాలో ఇవ్వాల్సిన కుళాయిల లక్ష్యం 1,37,436 కాగా నేటి వరకు 19,255 కుళాయిలు మాత్రమే ఇవ్వగలిగారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణాలను పలువురు నేతలు చేపట్టారు. వాటికి సంబంధించిన నిధులు సక్రమంగా విడుదల కాలేదు. ఈ కారణంగా గ్రామాల్లో నామినేషన్ పద్ధతిపై జలజీవన్ పనులు చేపట్టేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో పనులన్నీ నిలిచిపోయాయి. రూ.10 లక్షల పైబడిన పనుల కోసం పలు పర్యాయాలు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రాని దుస్థితి నెలకొంది. స్థానికంగా ఉన్న ప్రజాప్రతినిధులు, నేతలు హామీ ఇచ్చి కొన్ని పనులు పూర్తిచేయించగలిగారు. ఈ పనులు కూడా సక్రమంగా ▶ 2లో

మునెయ్యను హత్య చేయటం దుర్మార్గం

టిడిపి గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు

ప్రజాగళం సభకు వెళ్లారనే కారణంతో టిడిపి కార్యకర్త మునెయ్యను హత్య చేయటం వైసిపి నాయకులు హత్య చేయటం దుర్మార్గమని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. హత్యను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. అధికారం కోల్పోతున్నామన్న అక్కసుతో వైసీపీ నాయకులు నరమేథం సాగిస్తున్నారని ఆరోపించారు. టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసినవారిని, హత్యలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. చిలకలూరిపేట ప్రజాగళం సభకు గ్రామం నుంచి పెద్ద ఎత్తున జనాన్ని తరలించాడన్న అక్కసుతోనే మునెయ్య గొడ్డలితో నరికి చంపారని చెప్పారు. మునెయ్యను రాజకీయ హత్య చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితుల వెనుక ఉన్న నాయకులపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మునెయ్య కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసానిచ్చారు. సమావేశంలో టిడిపి గిద్దలూరు మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ బుడతా మధుసూదన్ యాదవ్, కడియం శేషగిరి, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.



మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఐద్వా నేతలు

మహిళా సమస్యల పరిష్కారంపై

పార్టీలు విధానం ప్రకటించాలి..: ఐద్వా

▲ 2లో

సంతనూతలపాడులో ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు ఆధ్వర్యంలో బాబు సూపర్ సిక్స్ పథకాల కార్యక్రమాన్ని మండల తెలుగు మహిళా కమిటీ ఆధ్వర్యంలో సంతనూతలపాడులో మంగళవారం ఇంటింటికీ తిరుగుతూ పథకాల గురించి వివరించారు. శంఖారావం ఆన్‌లైన్ ప్రోగ్రాం గురించి కూడా వివరించారు. కార్యక్రమంలో మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు నార్నే మాధవీలత, టిఎన్‌టియుసి ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి నారాయణస్వామి చౌదరి, బెజవాడ సుశీల, కొత్తపల్లి సాంబశివరావు, బొడ్డు సాయికిరణ్, మందాడి సాయి, మందాడి సుధీర్, మందాడి రమాదేవి, మందాడి అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో పాల్గొన్న తెలుగు మహిళలు

పశువులను సంరక్షించుకోవాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ఎండల నుంచి పశువులను సంరక్షించుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ కె బేబీరాణి కోరారు. పశుపోషకులు పశువులను ప్రతిరోజూ చల్లని నీటితో శుభ్రంగా కడగాలని ఆమె సూచించారు. మండలంలోని పేర్నమిట్టలో మంగళవారం పశుపోషకులు వేసవికాలంలో పశువుల గురించి తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఆమె పశుపోషకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ బేబీరాణి మాట్లాడుతూ పశువులను ఉదయం 11 గంటలలోపు సాయంత్రం నాలుగు గంటల తర్వాత మాత్రమే పశు మేత కోసం బయటకు విప్పాలని సూచించారు. ఎండలు తీవ్రమవుతున్న ఈ కాలంలో మధ్యాహ్న సమయంలో పశువులను మేత కోసం విప్పరాదని తెలిపారు. పశువుల షెడ్ల చుట్టూ జనపనార పట్టలను చుట్టి వాటిని చల్లని నీటితో తడుపుతూ ఉండాలని తెలిపారు. అనంతరం పశు పోషకులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ పి చిరంజీవి, పశుపోషకులు పాల్గొన్నారు.



కరపత్రాలను అందిస్తున్న డాక్టర్ బేబీరాణి

రేపు ప్రపంచ కవితా దినోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్: కళామిత్రమండలి (తెలుగు లోగిలి) ఆధ్వర్యంలో ఈ నెల 21న శనివారం సాయంత్రం 4.30 గంటలకు స్థానిక మల్లయ్య లింగం భవన్లో ప్రపంచ కవితా దినోత్సవ వేడుకల్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నూనె అంకమ్మరావు, సింహాద్రి జ్యోతిర్మయి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు, భాషా విభూషణ డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, ప్రముఖ సాహితీవేత్త, సంగీత విద్వాంసులు, కళారత్న డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు, నవ్యాంధ్ర రాష్ట్ర రచయితుల సంఘం గౌరవాధ్యక్షురాలు తేళ్ళ అరుణ పాల్గొని ప్రసంగిస్తారని చెప్పారు. అనంతరం జరిగే సభలో ప్రముఖులైన "పద్యభారతి" చదలవాడ లక్ష్మీనరసింహారావు, అధ్యక్షులు, జాతీయ పద్యసారస్వత పరిషత్ వారిని, భావకవి కె బాలకృష్ణారెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి డాక్టర్ డి ధాత్రికుమారిని ప్రతిభా పురస్కారాలతో సత్కరిస్తామన్నారు. అనంతరం కవి సమ్మేళనం జరుగుతుందని తెలిపారు.

నేడు నూతన భవనంలోకి యుబిఐ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

మండల కేంద్రం కొనకనమిట్ల ప్రధాన రహదారి, హెచ్‌పి పెట్రోల్ బంక్ సమీపంలో యూనియన్ బ్యాంక్ శాఖ కొత్త హంగులతో నిర్మించిన నూతన భవనానికి బుధవారం ఉదయం 10.09 గంటలకు ఉన్నతాధికారులు ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి విజయవాడ జోనల్ అధికారి రవీంద్ర బాబు, ఒంగోలు రీజనల్ అధికారి అరుణ, సవిత పాల్గొని ప్రారంభోత్సవం చేస్తారని స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ బి శ్రీనివాసులు తెలిపారు. ఖాతాదారులకు సౌకర్యంగా ఉండే విధంగా కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఏటీఎంను ఏర్పాటు చేయడంతో పాటు, బ్యాంకు లోపల ఏసి అమర్చినట్లు తెలిపారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఖాతాదారులు హాజరు కావాలని కోరారు.

ప్రలోభాల పర్వం.!

(మొదటిపేజీ తరువాయి)

వేస్తారనే ధీమాలో లేరు. అందుకే ముందుగా అభ్యర్థులను బదిలీ చేసేశారు. అసంతృప్తుల దెబ్బకు ఎవరూ గెలిచేలా లేరని సర్వేలు తేల్చాయి. అందుకే మంత్రులతో సహా అందరికీ స్థానభ్రంశం తప్పలేదు. ముందుగానే పాలకపక్షం నుంచి కానుకల డబ్బాలు ఎంపిక చేసిన వారికి అందజేశారు. పట్టాల పంపిణీతో పాటు చీరెలు అందజేశారు. రకరకాల ప్రలోభాలు ముందుకువచ్చాయి. మీడియా ప్రతినిధులకు విందులతో మర్యాదలు చేస్తున్నారు. పార్టీలకు ఎన్నికల్లో అవసరం ముడిపడి ఉన్న ప్రతి రంగాన్నీ ఏదో రకంగా కలుషితం చేస్తున్నారు. గ్రామాల్లో నిత్యం మద్యం ఏరులై పారుతోంది. ప్రభుత్వం అందజేసే మద్యంతో ఆరోగ్యాలు ఇప్పటికే దెబ్బతిని పేదలు ఆసుపత్రులపాలయ్యారు. కార్యకర్తలతో ఇప్పుడు మండల కేంద్రాల్లో రెస్టారెంట్లు కిటకిటలాడుతున్నాయి. సభలకు, ర్యాలీలకు వాహనాలు పెట్టి భోజనంతో పాటు బస్సు ఎక్కితే నోటు కూడా తప్పకుండా ఇస్తున్నారు. సిద్ధం సభకు ఇదే జరిగింది. ఇక కొద్దిగా జనం వెనుక ఉన్న నేతలకు మంచి గిరాకీ వచ్చింది. ఫిరాయింపులు ముందుకు వచ్చాయి. ఉన్న పార్టీని వీడి కొత్త పార్టీలోకి రావడం. ఇవన్నీ వ్యూహాత్మకంగా సాగుతున్నాయి. ప్రభావితం చేసే నేతలను మినహాయిస్తే కొందరు ప్రచారాలకు వీటిని ప్రోత్సహిస్తున్నారు. గుర్తింపు లేని కార్యకర్తలను పది మందిని తెచ్చి అభ్యర్థులతో మెడలో కండువాలు వేయిస్తున్నారు. వీరంతా ఫిరాయింపు కార్యకర్తలుగా మారారు. ఈ రోజు ఒక పార్టీలో ఉంటే మరుసటి రోజు ఇంకో పార్టీలో ఉంటున్నారు. ఇలాంటివి నిత్యకృత్యమవుతున్నాయి. ఇవన్నీ గ్రామాల్లో ప్రచారాలకు దోహదపడుతున్నాయి. ఇక కులాల వారీగా ఆత్మీయ సమ్మేళనాలు ముందుకు వచ్చాయి. సామాజిక అంశాన్ని తీసుకుని నియోజకవర్గాల్లో ప్రధాన ఎజెండాగా ముందుకు తెచ్చారు. మన కులం అభ్యర్థి.. మనోడే అనే ప్రచారాలకు తెరలేపుతున్నారు. వీటి వల్ల ప్రజల మధ్య ముఖ్యంగా పేదల మధ్య, కులాల మధ్య ఐక్యత పోతోంది. విభజన జరుగుతోంది. ఇలాంటి అప్రజాస్వామిక పద్ధతులను పార్టీలు ప్రోత్సహిస్తున్నాయి. ఇప్పుడు వైసిపి, తెలుగుదేశం అభ్యర్థుల ప్రచారం, ఎన్నికల వ్యవహారాల్లో ఇవే ప్రధానంగా ఉన్నాయి. ఓటు కోసం వాళ్లు అవలంబిస్తోన్న పంథాలు ఇలాగే ఉన్నాయి. ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిపై చెప్పేది తక్కువగా ఉంది. ప్రతిపక్షం కూడా సమస్యలపై పోరాటాలను వదిలి కేవలం ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగితే ఓటేస్తారనే అంచనాలతోనే ఉంది. రెండు పార్టీల అభ్యర్థులు ఓటుకు డబ్బు ఇవ్వడం కీలక కర్తవ్యంగా పెట్టుకుని వాటిని సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల్లో ఇలాంటి పద్ధతులను నియంత్రించాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పైనే ఉంది.

ముందుకు సాగని 'జలజీవన్'!

(మొదటిపేజీ తరువాయి)

బిల్లులు రాక అరకొరగా సాగుతూ వచ్చాయి.

కేంద్రప్రభుత్వం చేపట్టిన జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా రాష్ట్రప్రభుత్వ వాటా ధనంతో ఈ పనులు చేపట్టారు. కేంద్రం నుంచి నిధులు వచ్చినప్పటికి ప్రారంభంలో రాష్ట్రప్రభుత్వం నుంచి నిధుల విడుదలలో జాప్యం జరిగింది. అధికారులు పనులు ప్రారంభించేందుకు టెండర్లు పిలిచినప్పటికీ కాంట్రాక్టర్లు పనులు చేపట్టేందుకు ముందుకు రాలేదు. జల్‌జీవన్ పనుల్లో విపరీత జాప్యం చోటుచేసుకున్న నేపథ్యం ఈ వేసవికి కూడా గ్రామీణ ప్రాంత ప్రజలకు మంచినీటి కుళాయి కనెక్షన్లు ఇచ్చిన పరిస్థితి లేకపోయింది.

కొణికిలో నేత్రదానం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు మండలం కొణికిలో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన బండి రాములమ్మ(72) మృతి చెందగా నేత్రదానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీకి సమాచారం అందించారు. గుంటూరు శంకర కంటి వైద్యులు కొణికి గ్రామానికి వచ్చి రాములమ్మ కార్నియాలను సేకరించారు. నేత్రదానం చేసినందుకు రాములమ్మ భర్త నాగేశ్వరరావు, కుమారులు శ్రీనివాసరావు, వీరాంజనేయులు, కుమార్తె పిన్నెపల్లి సీతామహాలక్ష్మిలకు ఇంకొల్లు రోటరీ క్లబ్ అవయవదాన కమిటీ సభ్యులు రామమోహనరావు, జట్టి వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్షులు కరి కమలేశ్వరరావు, కోశాధికారి చుండి సాంబశివరావు, వారి కుటుంబ సభ్యులను అభినందించారు.

పట్టు తప్పితే ప్రమాదమే..!

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గ పరిధిలో పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం, దోర్నాల మండలాల పరిధిలో ఆటోలు, మినీ వ్యానుల్లో, ట్రాక్టర్లలో పరిమితికి మించి కూలీలను ఇష్టానుసారంగా తరలిస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. బాడుగ ఖర్చును పొల యజమానే భరించి ఎండు మిర్చి కోత కూలీ రోజుకు రూ.300 నుంచి డిమాండ్‌ను బట్టి రూ.350లు పొలం వద్దనే చెల్లిస్తున్నారు. దీంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో కూలీలు ఓ మండలం నుండి మరో మండలానికి వెళ్లి కోత పనులు చూసుకొని రాత్రి సమయానికి తిరిగి ఇంటి బాట పడుతున్నారు.



మిర్చి కోతకు వెళుతున్న కూలీలు

యర్రగొండపాలెం పట్టణం నుంచి ప్రతి రోజూ ఇతర మండలాలకు రోజుకు 4 వేల మంది వెళు తున్నారు. ఈ క్రమంలో ఆటోలు, ట్రాక్టర్ల, వ్యానుల డ్రైవర్లు పరిమితికి మించి కూలీలను ఎక్కించుకొని ప్రయాణిస్తున్నారు. ముఖ్యంగా మిరప కోతలకు పరిమితికి మించిన కూలీలతో ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో తరచూ ప్రమాదాలు చోటు చేసు కుంటున్నాయి. టాటా మ్యాజిక్ ఆటోలో ఆరుగురు ప్రయాణించాల్సి ఉండగా 30 మందిని ఎక్కిస్తున్నారు. ఆటోలో నలుగురు ప్రయాణించాల్సి ఉంటే 20 మందిని, మినీ వ్యాన్‌లో ఏకంగా 60 మంది ఎక్కించి ప్రయాణిస్తున్నారు.



ట్రాక్టర్‌పై మిర్చి కోతకు వెళుతున్న కూలీలు

నిబంధనలు అమలు చేస్తాం

సుదర్శన్, ఎస్ఐ, యర్రగొండపాలెం



రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. గతేడాది కంటే ప్రమాదాలు తగ్గేలా ముందస్తు చర్యలు చేపట్టాం. వాహన చోదకులు, ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. పరిమితికి మించి సరుకులు, ప్రయాణికులను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అతివేగమే చాలా ప్రమాదాలకు కారణమని దర్యాప్తులో తేలింది. సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటాం.

ఇదీ పరిస్థితి..

యర్రగొండపాలెం మండలంలోని వీరాయిపాలెం సమీపంలో ఆటో బోల్తా పడిన సంఘటనలో గతంలో ఒక మహిళ మృతి చెందింది. ఇక నిత్యం ప్రమాదాలు జరిగి కాళ్ళు, చేతులు విరగడం ఆనవాయితీగా మారింది. అప్పటో మినీలారి ప్రమాదం జరిగి నలుగురు మృతి చెందారు. చాలా మందికి దెబ్బలు తగిలాయి.త్రిపురాంతకం, దోర్నాల, పుల్లలచెరువు మండలాల్లోనూ ఈ సీజన్లో ప్రమాదాలు జరుగుతునూ ఉన్నాయి. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మృతి చెందిన ఏడుకొండలు

బైకులు ఢీకొని ఒకరు మృతి

- మరో వ్యక్తికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పొదిలి

బైకులు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మర్రిపూడి మండలం వెంకట క్రిష్ణాపురం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. ధర్మవరం గ్రామానికి చెందిన బారెడ్డి ఏడుకొండలు(63) పాల వ్యాపారం చేసుకుంటూ కొండపిలో నివాసం ఉంటున్నాడు. రోజులాగే బైకుపై ధర్మవరం గ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో గుండ్లసముద్రం గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తి మోటారు సైకిల్ పై వస్తున్నాడు. దీంతో ఏడు కొండలు అక్కడిక్కడే మృతిచెందాడు. వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ శివ బసవరాజు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్షతగాత్రుడిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -బల్లికురవ రూరల్

లారీ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. మూడు గొర్రెలు మత్యువాత పడ్డాయి. ఈ ఘటన బల్లికురవ నుంచి అద్దంకి వెళ్లే రహదారిలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని వల్లాపల్లి గ్రామానికి వెంపరాల పున్నయ్య (55) రోజులాగే గొర్రెల మందను తొలుకొని ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో అద్దంకి నుంచి వస్తున్న లారీ వల్లాపల్లి గ్రామ శివారు బస్‌షెల్టర్ మూలమలుపు వద్ద లారీ ఢీకొంది. దీంతో పున్నయ్య అక్కడికక్కడ మతి చెందాడు. మూడు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. స్థానికులు లారీని ఆపి డ్రైవర్‌కు దేహశుద్ధి చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి-చీరాల

ప్రమాదశాత్తు చోటు చేసుకున్న అగ్ని ప్రమాదంలో గడ్డివామి దగ్ధమైంది. ఈ ఘటన స్థానిక దండుబాటలో మంగళవారం చోటు చేసుకుంది. మంటలను గుర్తించిన స్థానికులు ఆర్పేందుకు ప్రయత్నించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అందిన వివరాల ప్రకారం.. దండుబాటు జవహర్ నగర్ ప్రాంతానికి చెందిన పమిడి సుబ్బారావు అనే రైతు తన ఇంటి వద్ద రూ.రెండు లక్షల విలువ చేసే గడ్డివామిని ఏర్పాటు చేసుకున్నాడు. సాయంత్రం సమయంలో గడ్డి వామిలో ఒక్కసారి మంటలు ఎగిసి పడ్డాయి. దీంతో చుట్టుపక్కల వారు మంటలను గమనించి సుబ్బారావు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ప్రమాదం గురించి సమాచారం అందుకునన అగ్ని మాపక కేంద్రం సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసింది. అప్పటికే గడ్డివామి మొత్తం కాలి బూడిదైంది.

గాయపడిన వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

పెద్ద దోర్నాలకు చెందిన మల్లికార్జున (40) అనే వ్యక్తి ఈనెల 17న పల్నాడు జిల్లా చిలకలూరిపేట వద్ద నిర్వహించారు. ప్రజాగళం సభకు వెళ్లాడు. సభ అనంతరం పెద్దదోర్నాలకు తిరిగి వస్తుండగా వినుకొండ సమీపంలో స్కూల్ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో మల్లికార్జునకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మల్లికార్జున మతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కంట్రోలు రూం ఏర్పాటు

ప్రజాశక్తి-చీమకుర్తి

సంతనూతలపాడు (ఎస్‌సి) అసెంబ్లీ నియోజకవర్గ కంట్రోలు రూము చీమకుర్తి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ,జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలు -2024కు సంబంధించి ఏవైనా ఫిర్యాదులుంటే ఫోను నంబరు 08592273100, సెల్ నంబర్‌కు 6305621139 ద్వారా సంప్రదించవచుచనని తెలిపారు. కంట్రోలు రూంలో హెల్ప్‌లైన్ 24 గంటలు పనిచేస్తుందన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-కొండపి

కొండపి పొగాకు వేలం కేంద్రానికి మండల పరిధిలోని చోడవరం ,ముప్పవరం గ్రామానికి చెందిన రైతులు 738 బేళ్లను అమ్మకానికి తెచ్చారు. అందులో 618 బేళ్లుఅమ్ముడు పోయాయి. వివిధ కారణాల చేత 120 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక ధర రూ.230, అత్యల్ప ధర రూ.220, సరాసరి ధర రూ.227.18 పైసలు పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు.

అప్పటి హామీలు ఏమయ్యాయి?


ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

2014లో రాష్ట్రానికి వెంకన్న సాక్షిగా మోడీ రాష్ట్రానికి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని కాంగ్రెస్ పార్టీ మార్కాపురం నియోజకవర్గ సమన్వకర్త సయ్యద్ జావీద్ అన్వర్ ప్రశ్నించాడు. ఇటీవల పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో నిర్వహించిన ప్రజాగళం సభలో ప్రధాని మోడీ రాష్ట్రానికి ప్రత్యేహోదా విషయం గురించి మాట్లాక పోవడం దారుణమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 2019లో ఒక్క అవకాశం ఇవ్వండి, కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తామని నమ్మించి అధికారం లోకి వచ్చి నేటి వరకు ఏమి సాధించలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి రాగానే ఆంధ్ర కు ప్రత్యేక హోదా పైనే తొలిసంతకం చేస్తామనిరాహుల్ గాంధీ స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలిపారు. బిజెపి కూటమిని ఓడించాలని ఆయన కోరారు.

వైసిపిలో పలువురు చేరిక

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాలకు చెందిన పలువురు మంగళవారం వైసిపిలో చేరారు. స్థానిక కార్యాల యంలో వైసిపి అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ సమక్షంలో వారు పార్టీలో చేరారు. తాటిపర్తి చంద్రశేఖర్ వారికి కండువాలు పార్టీలోకి ఆహ్వానించారు. వైసిపిలో చేరిన వారిలో మర్రివేముల మాజీ సర్పంచి రావూరి సుబ్బారావు, గోరంట్ల కనకారావు, కొర్రపోలు సుందర్, మరికొందరు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ పరిశీలకులు వెన్నా హనుమారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపిపిలు దొంతా కిరణ్ గౌడ్, కోట్ల సుబ్బారెడ్డి, జడ్‌పిటిసిలు చేదూరి విజయభాస్కర్, వాగ్యా నాయక్, ఎఎంసి మాజీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎఎంసి వైస్ చైర్మన్ కొర్రపోలు జయరావు, సర్పంచులు రామావత్ అరుణాబాయి, ఏకుల ముసలారెడ్డి, కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, వైసిపి మండల కన్వీనర్లు కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సింగారెడ్డి పోలిరెడ్డి,జడ్‌పికో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, నాయకులు గురిజేపల్లి వలి, నర్రెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



వైసిపిలో చేరిన వారితో తాటిపర్తి చంద్రశేఖర్

గుంటుపల్లి నాగేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి -కనిగిరి

పల్నాడు జిల్లా దాచేపల్లికి చెందిన టిడిపి క్రమశిక్షణ సంఘం జాతీయ సభ్యులు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు అనారోగ్యంతో మంగళవారం మతి చెందారు. అందులో భాగంగా ఆయన చిత్రపటానికి టిడిపి కనిగిరి నియోజక వర్గ అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి, నాయీ బ్రాహ్మణ మరియు బీసీ సంఘాలు, టిడిపి శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ టిడిపి క్రమశిక్షణ సంఘం జాతీయ సభ్యులుగా, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన సమయంలో టిడిపి మరియు బీసీ, నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి గుంటుపల్లి నాగేశ్వరరావు చేసిన కషి ఎనలేనిది అన్నారు. వారికి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. నివాళులర్పించిన వారిలో టిడిపి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాస రెడ్డి, యూత్ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు చింతలపూడి తిరుపాలు, నాయీ బ్రాహ్మణ సంఘ నాయకులు కనిగిరి మనోహర్ రావు, పతకమూరి నారాయణ, రాచర్ల వెంకటనారాయణ, ఈదర రవికుమార్, చింతలపూడి వాసుదేవరావు, దేనంకొండ కాశయ్య, ఈదర శ్రీనివాసులు, చెరుకూరి కాశయ్య, రాజమహేంద్రవరపు మురళి తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఓటర్లను ప్రలోభపెడితే సమాచారం ఇవ్వండి

ప్రజాశక్తి-బాపట్ల

మార్చి 13న జరిగే పార్లమెంటు అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాజకీయ పార్టీల నాయకులు ఓటర్లను ప్రలోభపెట్టే విధంగా ఉచితంగా గాని చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏ రకమైన వస్తువులు అందజేసినా తెలియజేయాలని, స్టేట్ ట్యాక్స్ బాపట్ల సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9154970445 నెంబరు వాట్సాప్ ద్వారా గాని, ఫోన్ ద్వారా గాని సమాచారం అందించాలని కోరారు.



ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో పాల్గొన్న సిబ్బంది

కొల్లూరులో 'ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-కొల్లూరు

ప్రతి గ్రామంలో ప్రజల వద్దకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో మంగళవారం మండల కేంద్రమైన కొల్లూరు పంచాయతీ కార్యాలయంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కొల్లూరు పీహెచ్‌సి వైద్యులు డాక్టర్ సుష్మ, స్పెషల్ డాక్టర్ అజింఖ్య పాల్గొని ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించారు. ఈ క్యాంపులో 382 మంది ప్రజలు వైద్యం చేయించుకున్నారు. కొల్లూరు ఎంపీడీవో లక్ష్మి కుమారి క్యాంపును సందర్శించి వైద్యసేవలను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఎంఎన్‌హెచ్‌లు, ఆశ వర్కర్లు, సూపర్‌వైజర్లు, 104 సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జునరావు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న వైసీపీ రేపల్లె అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్

చెరుకుపల్లి మండలంలో ప్రచారం

ప్రజాశక్తి-చెరుకుపల్లి

లబ్ధి పొందిన వారందరూ వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేయాలనే కృతనిశ్చయంతో ఉన్నారని రేపల్లె నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని ఆరుంబాక గ్రామ పంచాయతీ ఏమినేనివారిపాలెంలో ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. సంక్షేమ పాలన కావాలనుకునే వారందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గణేష్ అభ్యర్థించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కామినేని కోటేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు రావూరి సునీత, శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

కొనసాగుతున్న ఉపాధి హామీ పనులు

ప్రజాశక్తి-రేపల్లె

మండలంలోని చెన్నుపల్లివారిపాలెం గ్రామంలో ఉపాధి హామీ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. వ్యవసాయ పనులు లేక కూలీలు ఉపాధి హామీ పనులు చేసేందుకు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. అధికారులు సైతం పనులను పర్యవేక్షిస్తూ కూలీల హాజరు శాతాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఉపాధి కూలీలు పనులు చేసే సమయంలో తప్పకుండా జాగ్రత్తలు పాటించాలని అధికారులు కోరుతున్నారు. నిర్దేశించిన కొలతల ప్రకారం పనులు చేయాలన్నారు. ఉపాధి హామీ పనుల్లో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

కోర్టు ఆదేశాలతో..

సొసైటీ ఆక్రమిత స్థలం పరిశీలన

ప్రజాశక్తి-భట్టిప్రోలు

గత ఏడాది క్రితం ఆక్రమణకు గురైన అద్దేపల్లి సొసైటీ గోడౌన్ స్థలాన్ని ఎట్టకేలకు లోకాయుక్త కోర్టు ఆదేశాలతో మంగళవారం లోకయుక్త డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారి పీవీ సుబ్బారెడ్డి పరిశీలన చేపట్టారు. సొసైటీ స్థలానికి గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు దౌర్జన్యంగా ఉన్న గోడౌన్‌ను కూలదోసి దాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నం చేయడంతో గతంలో ప్రజాశక్తి వరుస కథనాలు ప్రచురించింది. దీనికి తోడు సమీపంలోని గ్రామస్తుడు, న్యాయవాది అబ్దుల్ రెహమాన్ ఈ స్థలం సొసైటీకి సంబంధించినదని, ఆక్రమణదారుల చెర నుంచి ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ లోకయుక్త కోర్టులో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదును విచారించిన న్యాయమూర్తి లోకయుక్త డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అధికారి పీవీ సుబ్బారెడ్డిని ఇన్వెస్టిగేషన్ అధికారిగా నియమించారు.



మండల అధికారులతో మాట్లాడుతున్న లోకాయుక్త సుబ్బారెడ్డి

మంగళవారం జరిగిన పరిశీలనలో స్థలానికి సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. 1962లో దాతలు అందించిన స్థలంలో గోడౌన్ నిర్మించారని, ఈ స్థలం సొసైటీకి సంబంధించి నట్లుగా పంచాయతీలో పన్నులు కూడా చెల్లించినట్లు ఆధారాలు ఉన్నాయని, స్థలం ముమ్మాటికీ సొసైటీకి సంబంధించినదేనని అన్నారు. సుమారు నాలుగు సెంట్లుగా ఉన్న ఈ స్థలం ఎవరైనా ఆక్రమిస్తే అలాంటి వారిపై కోర్టు ద్వారా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అలాగే సొసైటీ అధికారులు ఈ స్థలాన్ని ఫినిషింగ్ ఏర్పాటు చేసి స్వాధీన పరుచుకోవాలని ఆదేశించారు. ఈ మేరకు మండల సర్వేయర్, గ్రామ పంచాయతీ, రెవెన్యూ అధికారులతో విచారించి తగిన నివేదికలను సేకరించారు. వీటిని కోర్టులో సమర్పించినున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఫిర్యాదుదారుడు న్యాయవాది అబ్దుల్ రెహమాన్ సమక్షంలో ఈ విచారణ జరిగింది. ఈయన వెంట జిల్లా కేంద్ర సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్టర్ మోహన్‌రెడ్డి, లోకాయుక్త కోర్టు హెడ్ కానిస్టేబుల్ ఏ సాంబశివారెడ్డి, పంచాయతీ కార్యదర్శి కోట శ్రీనివాసరావు, సర్వేయర్ బీ శ్రీనివాసరావు, వీఆర్వో గ్రేసమ్మ, విలేజ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



టిడిపిలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్

30 కుటుంబాలు టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-చెరుకుపల్లి

మండల పరిధిలోని రాంబొట్లపాలెం గ్రామానికి చెందిన 30 కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. మాజీ జడ్పిటిసి సభ్యులు పిట్టు శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో వీరందరూ వైసిపికి రాజీనామా చేసి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరినీ రేపల్లె శాసనసభ్యులు అనగాని సత్యప్రసాద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ పొలిటికల్ మేనేజర్ పూషడపు కుమారస్వామి, పార్టీ నాయకులు రామ్ సుబ్బారెడ్డి, అలుమోలు చిరంజీవిరెడ్డి, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టిడిపి మేనిఫెస్టో వివరిస్తున్న ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య

ప్రజలు సహకరించాలి: ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి-చీరాల

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయని, నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేద్దామని నియోజవర్గ ఇన్‌ఛార్జి ఎంఎం కొండయ్య అన్నారు. మంగళవారం చీరాల తెలుగుదేశం పార్టీ దేవాంగపురి గ్రామ పార్టీ అధ్యక్షులు పృథ్వీ లలిత మోహన్, ప్రముఖ వస్త్ర వ్యాపారవేత్త సిద్ధి బుచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ, సూపర్ సిక్స్, బిసి సంక్షేమ డిక్లరేషన్ అంశాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి మద్దులూరి మాలకొండయ్య హాజరై మాట్లాడారు. టిడిపి నియోజవర్గ అభ్యర్థి విషయంలో ఎలాంటి అపోహలు వద్దని అధిష్టానం నుంచి తనకు పూర్తిస్థాయి మద్దతు ఉందని అన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన మేనిఫెస్టో పేదల జీవితాలలో వెలుగులు నింపుతుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించుకునేందుకు ప్రజలందరూ సహకరించాలని కోరారు. ఆయన వెంట టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజయ్యారు.



హిజ్రాలతో మాట్లాడుతున్న ఆర్‌డిఒ సూర్యనారాయణ

వివాదాలకు వెళ్లొద్దు: ఆర్‌డిఒ

ప్రజాశక్తి-చీరాల

చట్టానికి అందరూ సమానమే అని, వివాదాలకు వెళ్లకుండా వృత్తిని కొనసాగించుకోవాలని ఆర్డీవో సూర్య నారాయణరెడ్డి హిజ్రాలను హెచ్చరించారు. ఇటీవల కాలంలో పట్టణంలో రెండు గ్రూపులుగా ఉన్న హిజ్రాలు ఘర్షణ పడి ఒకరిపై ఒకరు దాడులు చేసుకొని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేసుకున్నారు. అయితే హిజ్రాల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు ఒకటో పట్టణ పోలీసులు మంగళవారం ఆర్‌డిఒ కోర్టులో హిజ్రాలను బైడోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో జి సూర్యనారాయణరెడ్డి ఓ వర్గంతో మాట్లాడి సమస్యను అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత వివాదాలతో ఇబ్బందులకు గురికారాదని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించవద్దని హెచ్చరించారు. అందరూ సహనంతో సమస్యలకు దూరంగా ఉండాలన్నారు. రెండో వర్గంతో కూడా వెంటనే మాట్లాడనున్నట్లు వివరించారు. గొడవలు పునరావృతమైతే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో వన్ టౌన్ పోలీస్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది హిజ్రాలు పాల్గొన్నారు.



బొకే అందిస్తూ మద్దతు తెలుపుతున్న జాండ్రపేట నాయకులు

వెంకటేష్‌కు జాండ్రపేట నాయకుల మద్దతు

ప్రజాశక్తి-చీరాల

చీరాల మండలం జండ్రపేట పంచాయతీ పరిధిలో నాయకులు చీరాల వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కరణం వెంకటేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి వారికి మద్దతు తెలిపారు. జరగనున్న ఎన్నికల్లో తమ పూర్తి మద్దతునిచ్చి గెలుపునకు సహకరిస్తామని తెలిపారు. ముందుగా వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించటం పట్ల వారు పూల బొకేతో ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు ఆసాది అంకాల రెడ్డి, కుమార్, మద్దు ప్రకాశరావు, పన్నెం దుర్గా మహేష్, సత్రం యోహాను, పింజల వెంకటసుబ్బయ్య, పి వెంకటేశ్వర్లు, కామంచి నాగేంద్రం, కామంచి నాగరాజు, అయిల స్వాములు, ఏ బలరామిరెడ్డి, బండారు శ్రీనివాసరావు, పింజుల వెంకటేశ్వర్లు, సత్రం చంద్రశేఖర్ బాబు, సత్రం అయ్యప్ప, పింజల అయ్యప్ప కుమార్, పి బాలసుబ్రమణ్యం, ఉప్పు పార్థసారథి, సజ్జ పవన్, జమ్మి ప్రసాద్‌రెడ్డి, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికల మార్గదర్శకాలు పాటించాలి

కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-కొండపి

భారత ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను అధికారులు పూర్తిగా అవగాహన చేసుకొని బాధ్యతతో తమ విధులు నిర్వర్తించాలని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి దినేష్‌కుమార్ తెలిపారు.స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని నోడల్ అధికారులు, ఎంసిసి, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, పోస్టల్ బ్యాలెట్ టీమ్స్, మానిటరింగ్ టీమ్స్‌కు శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల మార్గదర్శకాలను నోడల్ అధికారులు, ఎంసిసి, ఎప్ఎస్‌టి, ఎస్ఎస్‌టి , పోస్టల్ బ్యాలెట్ టీమ్స్ ఎన్నికల ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకూ ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. అభ్యర్థుల ఖర్చు వివరాలు నమోదు చేయడం చాలా కీలకమని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రశాంతంగా పోలింగ్‌ను నిర్వహించడంలో పోలింగ్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేస్‌కుమార్

అధికారులు పాత్ర ఎంతో కీలకమన్నారు. ఎన్నికల విధులు కేటాయింపబడిన ప్రతి ఒక్కరూ గురుతుర బాధ్యతగా ఎన్నికల విధులను నిర్వహించేందుకు ఇప్పటి నుంచే సమాయత్తం కావాలన్నారు. ఏ చిన్న సందేహం ఉన్నా వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. రిటర్నింగ్ అధికారులందరూ తమ బృందాల్లోని అధికారులను ఎన్నికలకు పూర్తిస్థాయిలో సంసిద్ధం చేసేలా బాధ్యత తీసుకోవాలన్నారు. అభ్యర్థుల ఖర్చు వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఎన్నికల నిర్వహణ కోసం నియమింపబడిన నోడల్ ఆఫీసర్స్, ఎంసిసి, ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, పోస్టల్ బ్యాలెట్ టీమ్స్, మానిటరింగ్ టీమ్స్ ఎన్నికల విధులపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలని కలెక్టర్ సూచించారు. ఓటర్లను ప్రభావితం చేసే అంశాలను నిరోధించడానికి పనిచేస్తున్న నోడల్ ఏజెన్సీలు ఖచ్చితంగా ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలను అను గుణంగా పనిచేయాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల నిర్వహణపై రూపొందించిన సివిజిల్ యాప్, ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు గురించి మరియు సివిజల్ , ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్‌లపై మాస్టర్ ట్రైనర్స్ జిల్లా ఆడిట్ అధికారి శకంర నారాయణరెడ్డి, ఉపాధి కల్పన అధికారి భరద్వాజ్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

పరీక్షా కేంద్రాల్లో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి-శింగరాయకొండ

పదో తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహిస్తున్నట్లు డిఇఒ సుభద్ర తెలిపారు. శింగరాయకొండలో 10వ తరగతి పరీక్ష కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. అదేవిధంగా ఓపెన్ ఇంటర్, ఓపెన్ 10వ తరగతి పరీక్షా కేంద్రాలను కూడా ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫ్లయింగ్ స్క్వాడ్ వెంకటరెడ్డి, ఎం.శ్రీనివాసరావు, డిప్యూటీ డిఇఒ అనితరాణి, ఎంఇఒ బి.శివనారాయణ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం హిందీ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలో మొత్తం 661 మంది విద్యార్థులు హాజరు కావాల్సిఉండగా 651 మంది హాజరయ్యారు. 10 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ మస్తాన్ నాయక్ తెలిపారు. మూడు కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఆయన చెప్పారు. ఫ్లయింగ్ స్క్వాడ్ చంద్ర మౌలేశ్వర రావు పరీక్షా కేంద్రాల్లో తనిఖీ చేశారు.

కొండపి : కొండపిలోని పదో తరగతి పరీక్షా కేంద్రాలను డిప్యూటీ డిఇఒ అనితా రోజ్‌రాణి, విజిలెన్స్ అధికారి ఝాన్సీరాణి తనిఖీ చేశారు. మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు మొత్తం 593 మంది హాజరు కావాల్సిన 586 మంది హాజరయ్యారు. ఏడుగురు గైర్హాజరైనట్లు ఎంఇఒ కె. సురేఖ తెలిపారు.

సౌకర్యాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

పవిత్ర రంజాన్ మాసం నేపథ్యంలో యర్రగొండపాలెం పట్టణంలోని అన్ని మసీదుల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ ముస్లిం పెద్దలు పంచాయతీ కార్యదర్శి ఈదుల రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ సుదర్శన్‌కు మంగళవారం వినతి పత్రాలు అందజేశారు. మసీదుల వద్ద పారిశుధ్య మెరుగుదలకు చర్యలు తీసు కోవాలన్నారు. తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. నమాజుకు వెళ్లే ముస్లిం సోదరులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పి కో ఆప్షన్ మెంబర్ సయ్యద్ షాబీర్‌బాషా, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబివుల్లా, షేక్, వలి, మునాఫ్, ఖాసిం, షరీఫ్, టివిఎస్.ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

- హడలిపోతున్న ప్రజలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రాంతంలో గత వారం రోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి. ఎండ తీవ్రత గంట గంటకు పెరుగుతోంది. మధ్యాహ్న సమయంలో నిప్పుల కుంపటిని తలపిస్తోంది. రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. మార్చి రెండవ వారం నుంచే ఎండలు మండుతున్నాయి. మంగళవారం యర్రగొండపాలెంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.



చిన్నారి దాహార్తి తీర్చుతున్న తల్లి



నెత్తిపై బొచ్చలు పెట్టుకొని వెళ్తున్న కూలీలు



ఎండకు నిర్మానుష్యంగా మారిన రహదారి

నిర్మానుష్యంగా రోడ్లు ..

ఎండల వేడిమి నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాలు, రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మరోవైపు రెక్కాడితేకానీ డొక్కాడని దినసరి కార్మికులు, రిక్షాకార్మికులు, రోడ్ల పక్కన పండ్లు, కూరగాయలు, ఇతర వస్తువులను అమ్ముకొని జీవించే చిరువ్యాపారులు విలవిలలాడుతున్నారు. ఉదయం 11 గంటల నుంచే వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోతున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు ప్రజలు రోడ్ల మీదకు రావడం లేదు.దీంతో ఎలా బతుకాలో కూడా తెలియడం లేదని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. మార్చిలోనే ఇలా ఉంటే ఏప్రిల్‌లో ఎలా ఉంటుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ాహనదారులు, ప్రయాణికులు, కూలీలు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వేడిమిని తట్టుకునేందుకు అవస్థలు పడుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

ఎండల అధికంగా ఉన్న నేపథ్యంలో తప్పనిసరి అయితే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని, ముఖ్యంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రావద్దని వైద్యులు సూచిస్తున్నారు. వడదెబ్బకు గురైతే వాంతులు, విరేచనాలతో పాటు తలనొప్పి, శరీరంలో ఉష్ణోగ్రతలు పెరిగి ప్రాణహాని కలిగే అవకాశాలుంటాయని, ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్నపిల్లలు, వద్ధులు, రోగులు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. తప్పనిసరి బయటకు రావలసి వస్తే తలకు రుమాలు, టోపీ ధరించి జాగ్రత్తలు తీసుకోవాలని, శీతలపానీలను, పండ్ల రసాలను, మజ్జిగను అధికంగా తీసుకోవాలని సూచించారు. మంచినీటిని ఎక్కువగా తీసుకోవాలని, పలుచని వస్త్రాలను ధరించాలని, కాళ్లు చేతులు, ముఖాన్ని చల్లటి నీటితో కడుక్కోవాలని సూచిస్తున్నారు. ఒకవేళ ఎండ దెబ్బ తగిలినట్లయితే వెంటనే వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు.



పోలింగ్ కేంద్రంలో పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

పోలింగ్ కేంద్రాల్లో పరిశీలన

ప్రజాశక్తి-పామూరు

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని కనిగిరి ఆర్‌డిఒ జాన్ ఇర్విన్ తెలిపారు. పామూరు పట్టణంలోని పలు పోలికేంద్రాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ అధికారులు రాజకీయ నాయకులకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లఘించిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఈ కార్యక్రమంలో పామూరు తహశీల్దారు షారుక్ బాషా, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళకు రక్తదానం


ప్రజాశక్తి-కొమరోలు

ఓ మహిళ అనారోగ్యంతో ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చేరింది. ఆమెకు రక్తం అవసరమని వైద్యులు తెలిపారు. దీంతో మహిళ బంధువులు ఈ విషయాన్ని మేము ఉన్నాము సేవాసమితి నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సిరి రెస్టారెంట్ అధినేత బాలిరెడ్డి మేము ఉన్నాం సేవాసమితి ఆధ్వర్యంలో 10వ సారి రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షుడు చెల్లా అశోక్ రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కొమరోలు

వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు మండల పరిధిలోని బాధినేనిపల్లి గ్రామంలోని బస్ షెల్టర్ వద్ద దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో దాత పుల్లయ్య సహకారంతో చలివేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్ర మంలో దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లోక్కు శరత్ బాబు. సెక్రటరీ సిద్ధయ్య ట్రెజరర్ కారుమంచి చిన్న పేరయ్య. సభ్యులు కామూరి శివరాం రెడ్డి పి. చంద్రశేఖర్, ఫ్రాన్సిస్, పుల్లయ్య, రాజశేఖర్ పాల్గొన్నారు.



మాగుంట రాఘవరెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మాగుంట రాఘవరెడ్డికి సత్కారం

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఒంగోలు పార్లమెట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డిని టిడిపి నాయకులు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాతశింగరాయకొండకు చెందిన టిడిపి ఉపాధ్యక్షుడు కొట్టే జాలయ్య, బాపట్ల శివకుమార్, షేక్ అబ్దుల్ అజీమ్, మసనం నరేష్, పిగిలి శ్రీనాథ్ పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- కనిగిరి

వైసిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పట్టణంలో మంగళవారం విస్తృతంగా పర్యటించారు . ఈ సందర్భంగా వివిధ షాపుల యజ మానులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించార. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంకు చైర్మన్ ప్రసాద్ రెడ్డి, జాతీయ వాసవీ సముదాయాల చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, వైసిపి నాయకులు గొబ్బిళ్ళ శీను, కష్ణారెడ్డి పాల్గొన్నారు.

‘మలినేని’లో నైపుణ్య ప్రదర్శన

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నైపుణ్య ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. అందులో భాగంగా హైదరాబాద్ వారిచే ఐటిఐ హెగ్డేన్ కోడింగ్ నైపుణ్య ప్రదర్శన 36 గంటలపాటు నిర్వహించారు. ఈ సందర్భంగా మలినేని సుశీలమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విద్యార్థినుల వివిధ రకాల ప్రాజెక్టులు తయారు చేశారు. నైపుణ్యం కోసం 36 గంటల పాటు ఈ ప్రాజెక్టులు కోడింగ్ చేస్తూ నిర్వహించారు. 70 మంది విద్యార్థులు గ్రూపులుగా ఏర్పాటై ఒక్కొక్క గ్రూపుకు ఒక్కొక్క ప్రాజెక్టు కేటాయించారు. హైదరాబాద్ కంపెనీ సిఇఒ పర్వతనేని మధు ఈ ప్రాజెక్టును పరిశీలించారు. ఉత్తమ గ్రూపులుగా ఐదు గ్రూపులను ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. పి. శ్రీ హరిత, ఎం.మల్లేశ్వరి ,బి.అమూల్య, జి.రజిని, కె.అలేఖ్య బృందం రూపొందించిన ఈ బేబీ హార్ట్ బీట్ మానిటరింగ్ ప్రాజెక్టుకు ప్రథమ బహుమతి లభించింది. బి.భాగ్యలక్ష్మి , జి.చాందిని, ఆర్.శ్రీదేవి, ఐ.దీక్షిత, బి.భాగ్య రేఖ టీం రూపొందించిన సేఫ్టీ కోల్ మైనింగ్ హెల్మెట్‌కు ద్వితీయ బహుమతి లభించింది. సాధించారు. డి.అరుణ,ఎన్.శ్రీవల్లి, అశ్విని, ఓజేస్విని, సాయి బృందం రూపొందించిన సెలైన్ మోనిటరింగ్ సిస్టమ్‌కు తృతీయ బహుమతి లభించింది. ఈ కార్యక్రమంలో మేక్ స్కిల్డ్ సిఇఒ పి.మధు మాట్లాడుతూ మలినేని మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రాజెక్టు రూప కల్పనలో అద్భుత ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. ఈ కళాశాలలో చదివిన విద్యార్థినులకు మంచి కంపెనీల్లో ఉద్యోగాలకు అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. మలినేని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళ మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రాజెక్టుల రూపకల్పనలో ప్రత్యేక శ్రద్ధ చూపే విద్యార్థినులకు ఎప్పుడు అండగా ఉంటామని వివరించారు. ప్రాజెక్టుల తయారీలో ప్రతిభ చూపిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ మూర్తి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, పర్యవేక్షకులు మోహన్ ప్రసాద్, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


బహుమతులు సాధించిన విద్యార్థినులు


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులో సూపర్ సిక్స్ పథకాలపై టిడిపి పట్టణ అధ్యక్షుడు తమ్మినేని శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడిడ్డ మాట్లాడుతూ వెనుకబడిన కనిగిరి అభివద్ధి చెందాలంటే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చింతలపూడి తిరుపాలు, ఈదర రవికుమార్, యాసిన్, కనిగిరి మనోహరరావు, పండు, షడ్రక్, రామయ్య, రాచర్ల వెంకట నారాయణ, చింతలపూడి వాసుదేవరావు, కాశయ్య, వాజిదా బేగం, దొరసాని తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న దద్దాల నారాయణ యాదవ్

సమన్వయంతో పనిచేయాలి

కనిగిరి : స్థానిక వైసిపి కార్యాలయంలో కనిగిరి మండల రూరల్ పరిధిలోని బూత్ కమిటీ సభ్యులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్, నియోజకవర్గ పరిశీలకులు చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ గ్రామాలలో పార్టీ బలోపేతానికి బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రతి కార్యకర్తను ప్రతి ఓటరు కలిసి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ గ్రామ బూత్ కమిటీ నాయకులు కార్యకర్తలను, నాయకులను సమన్వయం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ చైర్మన్ వైఎం.ప్రసాద్ రెడ్డి, కనిగిరి జడ్‌పిటిసి కస్తూరి రెడ్డి,ఏడవల్లి సర్పంచి కాసుల గురవయ్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ సూరసాని మోహన్ రెడ్డి, బూత్ కమిటీ అధ్యక్షులు, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువపత్రాలపై విచారణ జరపాలి

తిపురాంతకం : త్రిపురాంతకం మండలంలో కొంత మంది ఎస్‌సిల పేరుతో కుల ధ్రువపత్రాలు పొంది తమకు అన్యాయం చేస్తున్నట్లు ఎస్‌టి సంఘం నేతలు ఆరోపించారు. ఈ మేరకు తహశీల్దారు వెంకటేశ్వర్లకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఎస్‌టి కుల ధ్రువపత్రాలు పొంది ప్రభుత్వం నుంచి అక్రమంగా లబ్ధి పొందుతున్న వారిని గుర్తించాలని కోరారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. దీనిపై పరిశీలించి న్యాయం చేస్తానని తహశీల్దారు వారికి హామీ ఇచ్చారు.

రైతులకు డ్రమ్ములు పంపిణీ

ప్రజాశక్తి-కొండపి

మండల పరిధిలోని అనకర్లపూడి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులకు కషాయాల తయారీ కోసం డ్రమ్ములు, టార్పాలిన్ పట్టలు మంగళవారం ఉచితంగా పంపిణీ చేశారు.ఎస్‌సి కార్పొరేషన్ , ఎపిసిఎన్‌ఎఫ్ వారి ఆధ్వర్యంలో రైతులు డమ్ములు, పట్టలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌ఛార్జి ఎస్తేరమ్మ, వై.రంజిత్ కుమార్, గౌతమి, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పుల్లలచెరువు

ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే కందులు విక్రయించాలని ప్రొక్యూర్మెంట్ సిబ్బంది నాగేష్, మంత్రు నాయక్, అంజి నాయక్ తెలిపారు. మండల పరిధిలోని మల్లాపాలెం గ్రామంలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. రైతుల వద్ద ఉన్న కందులను టెస్టింగ్ కోసం సేకరించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వమే నేరుగా రైతుల నుంచి కందులు కొనుగోలు చేస్తుందన్నారు. దళారుల మాట విని మోసపోవద్దని రైతులకు సూచించారు. ప్రభుత్వం రైతులకు నాణ్యమైన మద్దతు ధరను కల్పిస్తుందని చెప్పారు. ప్రస్తుతం కందుల కొనుగోలు ధర క్వింటా రూ. 9,642 ప్రభుత్వం నిర్ధారించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కందుల కొనుగోలు కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


కందులను పరిశీలిస్తున్న అధికారులు

సచివాలయ సిబ్బంది

సమయపాలన పాటించాలి : గఫార్

ప్రజాశక్తి- కనిగిరి

సచివాలయాల సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ తెలిపారు. కనిగిరి-4 సచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ సచివాలయం సిబ్బంది విధులు పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తప్పనిసరిగా విధులు నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా వివిధ పనుల నిమ్మితం సచివాలయం వద్ద వచ్చిన ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సేవలను నిర్ణీత గడువులోపు ప్రజలకు సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ క్యాలెండర్ పై లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్య పరచాలన్నారు.ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సచివాలయంలో తనిఖీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

ఇంటింటి ప్రచారం

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని 17 వ వార్డు ఆంధ్ర బ్యాంకులైన్‌లో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ , వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్ రెడ్డి , మాణిక్యరావు వైసిపి అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్‌కు మద్దతుగా మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని కోరారు ఈ కార్యక్రమంలో వాసవీ సత్ర సముదాయ అధ్యక్షుడు దేవకి వెంకటేశ్వర్లు. ఎఎంసి మాజీ చైర్మన్ సరితా రెడ్డి. రాష్ట్ర మెడికల్ బోర్డు మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకష్ణ. రాష్ట్ర మహిళా విభాగ కార్యదర్శి తమ్మినేని సుజాత రెడ్డి. వార్డు కౌన్సిలర్లు దేవకి రాజీవ్, దేవరాజ్, దాసరి మురళి, పెన్నా ఏడుకొండలు, దేవకి సత్యవతి, పులి శ్రీనివాసులురెడ్డి, శ్రీరామ్ సతీష్, వైసిపి పట్టణ యూత్ అధ్యక్షుడు డాక్టర్ నాయబ్ రసూల్ , జిల్లా రైతు అధ్యక్షుడు సూరసాని మోహన్ రెడ్డి, మున్సిపల్ కోఆప్షన్స్ మెంబర్ చింత శ్రీనివాసులు, గూడూరు అబ్రహం లింకన్, షేక్ ఖాజా, వైసిపి నాయకులు బసిరెడ్డి పిచ్చిరెడ్డి, కనుమరుల కష్ణారెడ్డి, షేక్ మీరావలి, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, షేక్ ఖాదర్ బాషా, కసిరెడ్డి రామసుబ్బారెడ్డి, యోగి రెడ్డి, దేవకి సుబ్రహ్మణ్యం, ముచ్చర్ల ధర్మారావు, వేమా మురళి, కడికి మల్ల వెంకటేశ్వర్లు, కనుమలపూడి లక్ష్మి, గహసారథులు

గ్లోబల్ రీసైక్లింగ్ పై అవగాహన

ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని దేవాంగనగర్ ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్లోబల్ రీసైక్లింగ్ దినోత్సవాన్ని మంగళ వారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.దీవెన అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ మంద్రు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ రోజువారీ జీవితంలో భాగం పునర్వినియోగం, రీసైక్లింగ్ అనే 3 ఆర్‌లను సులభంగా అనుసరించవచ్చునని తెలిపారు. ప్రతి రోజు షాపింగ్ చేసేటప్పుడు పర్యావరణకు హాని కలిగించే ప్లాస్టిక్ సంచులను వినియోగించకుండా గుడ్డ సంచులను ఉపయోగించాలన్నారు. గుడ్డ సంచులను అదే ప్రయోజనం కోసం మళ్లీ మళ్లీ వినియోగించుకోవచ్చునని తెలిపారు. కూరగాయలు మరియు పండ్లను కడిగిన నీటిని మొక్కలకు ఉపయోగించాలన్నారు. నీటిని పునర్వినియోగం చేయడం ద్వారా ప్రతిరోజూ కొంత నీటిని ఆదా చేయవచ్చునని తెలిపారు. వార్తాపత్రికలు, పాత పుస్తకాలు, దుస్తులు విసిరేయకుండా వాటిని కూడా రీసైకిల్ చేయవచ్చునని తెలిపారు. పేపర్లను రీసైకిల్ చేస్తే తక్కువ చెట్లు నరికి వేయబడతాయన్నారు. తద్వారా సహజ పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని తెలిపారు. కార్బన్ ఉద్గారాలను తగ్గించ వచ్చునని తెలిపారు. ప్రజలు ఆరోగ్యాంగా జీవించవచ్చునని తెలిపారు. ఈ విషయాలను విద్యార్థులు తమ తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రవీణ్ కుమార్

ప్రజాగళం సభ

భద్రతా వైఫల్యంపై విచారణ చేపట్టాలి

బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి: అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

దేశ ప్రధాని నరేంద్రమోదీ హాజరైన చిలకలూరిపేట బొప్పూడి ప్రజాగళం సభ భద్రతలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసు ఉన్నాతాధికారులపై చీఫ్ ఎలక్షన్ కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్ అన్నారు. లక్షలాదిమంది జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన పోలీసులు చోద్యం చూడటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. టీడీపీ, జనసేన, బీజేపీ తొలి ఎన్డీఏ సభ నభూతో నభవిష్యత్ అన్నట్టు విజయవంతమైందని తెలిపారు. మూడు పార్టీల కార్యకర్తలు, అభిమానులంతా తపాల్గొని సభను విజయవంతం చేశారు. అయితే ట్రాఫిక్ జామ్ వల్ల వేలాదిమంది సభకు రాలేకపోయారు. ప్రధానమంత్రి ఈ సభ ద్వారా ఒకటి స్పష్టం చేశారు. ఏపీ ప్రజల కష్టాలు తనకు తెలుసని, వచ్చే ఐదేళ్లు ఎంతో కీలకమైనవని ఆయన చెప్పారు. ఏపీ ప్రజలకు అండగా ఉంటానని అన్నారు. 5 సంవత్సరాల జగన్‌రెడ్డి పాలనలో అభివృద్ధి ఆగిపోయిందని, అవినీతి, దోపిడీలో అధికార వైసీపీ నేతలు పోటీపడ్డారని సభ ద్వారా ప్రధాని స్పష్టం చేశారన్నారు. ఏపీ ప్రభుత్వంపై ప్రజాగ్రహం ఏ స్థాయిలో ఉందో చిలకలూరిపేట సభ ద్వారా తెలుస్తోందని, ఈ అరాచక పాలనను అంతం చేయడానికి ప్రజలంతా సమాయత్తం కావాలని ప్రధాని పిలుపునిచ్చారని తెలిపారు. ఆరోగ్యశ్రీ సహా అనేక పథకాలకు కేంద్రం నిధులిస్తున్నా ఏపీ ప్రభుత్వం సొంత స్టిక్కర్లు వేసుకుంటా అంతా తామే ఇస్తున్నట్టు ప్రచారం చేసుకుంటోందని ప్రధాని చెప్పింది నూటికి నూరుపాళ్లు నిజమని తెలిపారు. లక్షలాది మంది ప్రజలు హాజరైన సభకు పోలీసులు ఇచ్చే భద్రత ఇదేనా? దాదాపు 12 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయిందని, స్వయంగా ప్రధాని హాజరైన సభ వైపు జనం తోసుకొస్తుంటే నియంత్రించాల్సిన బాధ్యత పోలీసులకు లేదా అని ప్రశ్నించారు. పోల్స్ ఎక్కినవారు దిగాలని, వారిని స్థానిక పోలీసులు నియంత్రించాలని స్వయంగా ప్రధానే చెప్పారంటే పోలీసు వైఖరి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చునని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి సభలో క్రౌడ్ మేనేజ్‌మెంట్ బాధ్యత ఎవరిది? అధికారులను ఏర్పాటుచేసి, జనాన్ని నియంత్రాంచాల్సిన బాధ్యత సీనియర్ పోలీసు అధికారులకు లేదా? మరి ఎందుకు నిర్లక్ష్యం వహించారో తేలాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రధాని భద్రత, జనం, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలను పోలీస్ బాస్ లు ఎందుకు పట్టించుకోలేదో చీఫ్ ఎలక్షన్ కమిషన్ సమగ్ర విచారణ చేయాలని కోరారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంతో పాటు అందులో పనిచేస్తున్న కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే సభకు అడ్డంకులు సృష్టించేందుకు ప్రయత్నించారని ఆరోపించారు. ఎవరు ఎన్ని కుట్రలు చేసినా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు సభను బ్రహ్మాండంగా విజయవంతం చేశారని ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.



కలికివాయిలో 'పల్లెపల్లెకు సురేష్ అన్న'

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ మండలం కలికివాయి గ్రామ పంచాయతీలో మంగళవారం రాత్రి 'పల్లె పల్లెకు సురేష్ అన్న' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కొండేపి వైసిపి అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు. ముందుగా స్థానిక దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించుకొని అనంతరం ఆది ఆంధ్ర కాలనీలో సమావేశం ఏర్పాటు చేసి ఆయన ప్రసంగించారు. జగన్ ప్రభుత్వం పేద ప్రజలకు అండగా నిలిచిందని వివరించారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా వైసిపి నుంచి పోటీ చేస్తున్నానని, తనను ఆదరించాలని కోరారు. వీరి వెంట ఎంపీపీ కట్టా శోభారాణి, ఎంపీపీ సామంతుల రవికుమాం రెడ్డి, సర్పంచ్ చిడిపూడి వెంకటరత్నం, ఎంపీటీసీ ఉల్చి అరుణ, వైసిపి నాయకులు చామల ఉదయశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

వైద్య, ఆరోగ్య ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-బాపట్ల

ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రక్రియ సత్వరమే పూర్తి చేయాలని, ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ అసోసియేషన్ బాపట్ల జిల్లా శాఖ అధ్యక్షుడు కూరపాటి సత్యం రాజు అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో జరిగిన వైద్యారోగ్య స్పందనలో ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ఎస్ విజయమ్మకు అర్జీ అందజేశారు. సత్యంరాజు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో పనిచేసే వైద్యాధికారులు, ఆశా కార్యకర్తలు ఏఎన్ఎంలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్టులు, హెల్త్ అసిస్టెంట్లు, ఎంఎన్ఓ ఎఫ్ఎన్ఓలకు సంబంధించిన శాఖాపరమైన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా కాంట్రాక్టు సిబ్బందికి నూరుశాతం మూలవేతనం అమలు చేయడంతో పాటు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతాలు వెంటనే పెంచాలన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బడుగు శివాజీ, ఎడ్ల శ్రీనివాసరావు, శ్రీమతి శ్యామల, వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

28న బార్ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి-రేపల్లె



ప్రశాంత్‌కుమార్

రేపల్లె బార్ అసోసియేషన్ న్యాయవాదుల సంక్షేమ సంఘ పాలకవర్గ ఎన్నికలు ఈ నెల 28న నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రముఖ న్యాయవాది గుజ్జర్లమూడి ప్రశాంత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-2024 పాలకవర్గ పరిపా లన సమయం ముగిసిన సందర్భంగా 2024-2025 నూతన పాలకవర్గం ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 21వ తేదీన ఉదయం 10:30 నుంచి 22వ తేదీ సాయంత్రం నాలుగు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని, వాటి పరిశీలన, ఉపసంహరణ 23వ తేదీ ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం మూడు గంటల వరకు జరుగుతుందన్నారు. ఎన్నికలు 28వ తేదీ ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4:30 వరకు జరుగుతాయని అదే రోజు ఓట్ల లెక్కింపు నూతన కమిటీ విజేతలను ప్రకటిస్తామని ప్రశాంత్ తెలిపారు. అధ్యక్షులుగా పోటీ చేసేవారు న్యాయవాద వృత్తిలో 12 సంవత్సరాల అనుభవం ఉండి ఐదువేల రూపాయలు దరావత్తు, ఉపాధ్యక్షులుగా పోటీ చేసేవారు 10 సంవత్సరాల అనుభవం ఉండి 3,000 రూపాయలు ధరావత్తు, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శిగా పోటీ చేసేవారు 8 సంవత్సరాల అనుభవం ఉండి రూ.2,000 దరావత్తు, గ్రంథాలయ కార్యదర్శి, కోశాధికారి క్రీడలు, సాంస్కృతిక విభాగం మహిళా ప్రతినిధులు కూడా ఆరు సంవత్సరాల అనుభవం ఉండి రూ.1000 చెల్లించాలని తెలిపారు. కార్యవర్గ సభ్యులు రెండు సంవత్సరాల అనుభవం ఉండి 500 రూపాయలు దరావత్తు చెల్లించాలని సూచించారు. న్యాయవాదులు తమ ఓటును తప్పకుండా వినియోగించుకోవాలని ప్రశాంత్ కుమార్ కోరారు.

అద్దంకిలో పోలీసు కవాతు

ప్రజాశక్తి-అద్దంకి

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణ కోసం ప్రజలకు మేమున్నామనే భరోసా ఇచ్చేందుకు బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలోని కలవకురు, రెడ్డిపాలెం, ధర్మవరం గ్రామాలలో పట్టణ సీఐ కృష్ణయ్య ఆధ్వర్యంలో కేంద్ర బలగాలు (బిఎస్ఎఫ్ బలగాలు) అద్దంకి పట్టణ పోలీస్ అధికారులు, సిబ్బంది మార్చి 19న మంగళ వారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రజలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును నిర్భయంగా ప్రలోభాలకు లోను కాకుండా వినియోగించుకునేందుకు పోలీసు వారు ఎప్పుడూ ప్రజలకు అండగా ఉంటారని, ప్రజలు ఎటువంటి అపోహలకు గురి కావద్దని, ప్రతి ఒక్కరికీ రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసు వారిదేనని, ప్రతి పౌరుడు నిర్భయంగా వారి ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.



విన్నర్స్ కప్పు గెలిచిన వాలీబాల్ జట్టుతో కళాశాల సిబ్బంది

చలపతి వారి నోవమ్-2024 ఫెస్టివల్‌లో..

విన్నర్స్ కప్పు గెలిచిన వాలీబాల్ జట్టు

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ బి టెక్ విద్యార్థులు గుంటూరులోని చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ వారు నిర్వహించిన నోవమ్-2024 పోటీలలో వాలీబాల్ పోటీలలో విన్నర్స్ గెలుపొందినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ ఎస్ లక్ష్మణ రావు సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజి వారి నోవమ్ 2024 (-నేషనల్ యూత్ ఫెస్టివల్) సందర్భంగా జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలలో కళాశాల వాలీబాల్ జట్టు విన్నర్స్ గెలు పొందినట్లు కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ కె జగదీష్ బాబు చెప్పారు. ఈ పోటీలలో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలలోని 28 కళాశాలల నుంచి వాలీబాల్ జట్లు పాల్గొనగా, ఫైనల్ పోటీలో కాకినాడ కైట్ కళాశాల జట్టును ఓడించి విన్నర్స్‌గా నిలిచినట్లు కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు తెలిపారు. ఈ జట్టులో ఆర్ రమణ, ఎం రేవంత్, మణి, వెంకట మణి కుమార్, కె వెంకట శివారెడ్డి, ఆర్ విష్ణు బాబు, ఎస్ తాతాజీ, జి సాయికృష్ణ, కె ఆంద్రూస్, జి వెంకట రమణ తేజారెడ్డి, కె సాయి కుమార్, కె సన్ని, ఎం మణికంఠ జట్టు పాల్గొన్నట్లు వివరించారు. విన్నర్స్‌గా గెలుపొందిన ఈ జట్టుకు నగదు బహుమతి అందించారన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్, వివిధ విభాగాధిపతులు, కళాశాల వ్యాయామ ఉపాధ్యాయులు అన్నం శ్రీనివాసరావు, కళాశాల మేనేజరు ఆర్‌వి రమణమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, వాలీబాల్ జట్టు విద్యార్థులను అభినందించారు.

పొగాకు కిలో సరాసరి ధర రూ.226.57

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోనున్న ఒంగోలు 1వ పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం నేలటూరు గ్రామ రైతులు వేలం కేంద్రానికి 706 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకొచ్చారు. వాటిలో 629 బేళ్లు కొనుగోళ్లు జరిగాయి. వివిధ కారణాలతో 77 బేళ్లను తిరస్కరించారు. అత్యధిక ధర కిలో రూ.230 పలుకగా అత్యల్ప ధర రూ.220 పలికింది. సరాసరి కిలో ధర రూ.226.57 రూపాయలు పలికింది. వేలంలో 21 కంపెనీలు పాల్గొన్నాయి. వేలం కేంద్రం నిర్వహణాధికారి ఎం రవికాంత్ వేలాన్ని నిర్వహించారు.

మనుగడ కోసమే బిజెపి పాకులాట



పేరం ప్రభాకర్

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

రాష్ట్రంలో మనుగడ కోసమే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ టిడిపి-జనసేన పార్టీల నేతలతో చెట్టపట్టాలు వేసుకొని తిరుగుతున్నారని ఎపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరం ప్రభాకర్ విమర్శించారు. మంగళవారం మీడియాకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిన్న మొన్నటి వరకు ప్రధాని మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితో అంటకాగి నేడు కాంగ్రెస్, వైసిపిల మధ్య రహస్య ఒప్పందం ఉందని చెప్పటం మోడీ కుటిల రాజకీయానికి నిదర్శనమని ప్రభాకర్ ధ్వజమెత్తారు. బిజెపి సహకారంతోనే ఎలక్టోరల్ బాండ్లలో పెద్దఎత్తున అవినీతి జరిగిందని అన్నారు. బాండ్లు ఇచ్చిన దాతలు, పుచ్చుకున్నవారి పేర్లు తెలిసేలా ఎన్నికల బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ కోడ్‌లను ఎస్‌బిఐ అందజేయాలంటూ సుప్రీమ్ కోర్టు ఆదేశాలు జారీ చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. దీనిపై విచారణ జరిపించి ఎలక్టోరల్ బాండ్ల గురించి నిజానిజాలు బయటపెట్టాలని పేరం ప్రభాకర్ డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

పార్టీ కోసం సైనికుల్లా పని చేయాలి

మాజీ ఎమ్మెల్యే కందుల

ప్రజాశక్తి-మార్కాపురం

ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కార్యకర్తలను కోరారు. పట్టణంలోని జవహర్ నగర్ కాలనీలోని మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ఇంటి వద్ద మార్కాపురం పట్టణ కార్యకర్తలతో మంగళవారం రాత్రి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి వైసిపి ప్రభుత్వం చేసిన అరాచకాలను, ప్రజా వ్యతిరేక విధానాలను వివరించి తెలుగుదేశం పార్టీకి ఓటు వేయించాలని కోరారు. వైసిపి నాయకులు కేవలం డబ్బు ప్రభావంతో ఎన్నికలలో గెలవాలని ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. గత 22 సంవత్సరాల నుంచి మార్కాపురం నియోజకవర్గంలో ప్రజా సమస్యలపై పోరాడుతున్నామని, ఈ విషయాలను ప్రతి ఒక్కరికీ వివరించాలని కోరారు. తెలుగుదేశం పార్టీలో అన్ని కులాల వారికి సమాన న్యాయం జరుగుతుందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన వెంటనే మార్కాపురం జిల్లా కేంద్రం ప్రకటన, నియోజకవర్గ అభివృద్ధి అన్ని విధాలా ముందుకు తీసుకెళతామని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందుల రామిరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు మౌలాలి, క్లస్టర్ ఇన్‌ఛార్జి వక్కలగడ్డ మల్లికార్జున, కొప్పుల శ్రీనివాసులు, దూదేకుల మస్తాన్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరు

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం జరిగిన హిందీ పరీక్షకు 11 మంది విద్యార్థులు గైర్హాజరయినట్లు ఎంఇఒ ఎం సత్యనారాయణ తెలిపారు. మొత్తం నాలుగు కేంద్రాల్లో పరీక్షలు జరుగగా 722 మంది విద్యార్థులకు గాను 711 మంది పరీక్షకు హాజరైనట్టు ఆయన వివరించారు.

3 రోజుల పాటు వర్షాలు

- రైతులు అప్రమత్తంగా ఉండాలి - ఏవో బాలాజీ గంగాధర్

ప్రజాశక్తి-చెరుకుపల్లి

ఈ నెల 19 నుండి 21 వరకు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని రైతులందరూ జాగ్రత్తగా వ్యవహరించాలని మండల వ్యవసాయ శాఖ అధికారి టి.బాలాజీ గంగాధర్ సూచించారు. భారత వాతావరణ శాఖ సూచన మేరకు భారీ వర్షాలు, ఉరుములు మెరుపులతో కూడిన వడగళ్ల వానలు కురిసే అవకాశం ఉంటుందన్నారు. రైతులందరూ రబీ పంట చేతికి వచ్చే సమయం కావడంతో జాగ్రత్తగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

షుగర్, బీపీ నివారణపై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



ఇంటింటి సర్వే కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్థానిక మంగమూరు డొంకలో వైద్య విద్యార్థులు షుగర్, బిపి, క్యాన్సర్, ఫ్లోరోసిస్ నివారణపై ప్రజలకు అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో షుగరు, బిపి ఉన్న వారు ఎలాంటి అహార పదార్థాలు తీసుకోవాలి, మందులు సరిగా వాడుతున్నారా లేదా, లక్షణాలు తగ్గాయా, లేదా అనే వివరాలు తెలుసుకున్నారు. బియ్యం, మైదా, పంచదారతో కూడిన పదార్థాలు తక్కువగా తీసుకోవాలని, జంక్ ఫుడ్స్ అయిన సమోసాలు, నూనె తో చేసిన బజ్జీలు, బోండాలు, ఫాస్ట్ ఫుడ్స్‌కి దూరంగా ఉండాలని సూచించారు. జామ, నారింజ, దానిమ్మ, నేరేడు వంటి పండ్లు తీసుకోవాలని ప్రజలకు వివరించారు. వీరితో పాటు పోస్టు గ్రాడ్యుయేట్ విద్యార్థులు., షుగరు, బిపి ఉన్నవారు రాగులు, సజ్జలు, జొన్నలు, వరిగెలు, కొర్రెలు, అరికెల వంటి చిరుధాన్యాలు వాడాలని సూచించే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ బి.తిరుమలరావు మాట్లాడుతూ షుగర్ వ్యాధిగ్రస్తులు తీపి పదార్థాలు తక్కువగా తీసుకోవాలని, వ్యాయామం క్రమం తప్పకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హిమ బిందు, పోస్టు గ్రాడుయేట్స్ డాక్టర్ పి.విష్ణు ప్రియ, డాక్టర్ ప్రెస్సీ హర్షిత, డాక్టర్ వి.కిరణ్‌కుమార్, డాక్టర్ అనిల్, ఫ్లోరోసిస్ అధికారి డాక్టర్ అభిజిత్, డాక్టర్ మణికంఠ, డాక్టర్ వినోద్, ఆశావర్కర్లు, హౌస్ సర్జన్లు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లు సీజ్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్



సిలిండర్లు సీజ్ చేస్తున్న డిఎస్ఓ ఉదయభాస్కర్

సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశాల మేరకు జిల్లా పౌర సరఫరాల అధికారులు ఒంగోలు నగరం శివాలయం సెంటర్‌లోని ఓ ఫ్రూట్ స్టాల్, ఒక హోటల్ లో ఆకస్మిక తనిఖీ నిర్వహించి గృహ అవసరాలకు వినియోగించే 8 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. 6ఏ కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డిఎస్ఓ ఏ.ఉదయ భాస్కర్ మాట్లాడుతూ ఎవరైనా హోటల్స్‌లో గృహ అవసర సిలిండర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపార సంస్థలలో వాణిజ్య సిలిండర్లు మాత్రమే వాడుకోవాలని సూచించారు. నగరంలోని అన్ని గ్యాస్ ఏజెన్సీలు ఎన్ని కమర్షియల్ కనెక్షన్లు కావాలన్నా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. హోటల్స్‌లో తినుబండారాలు దుకాణాలలో బజ్జీ, పానీపూరి బండ్లు, చికెన్ సెంటర్లు, వెల్డింగ్ సెంటర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ గృహ అవసర సిలిండర్లు వాడుకోవటాన్ని ఎట్టి పరిస్థితులలోనూ సహించమన్నారు. వీటిని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడులలో ఒంగోలు ఫుడ్ ఇన్స్పెక్టర్ ఊతకోలు శ్రీనివాసరావు, డిఎస్ఓ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపట్నం తీర ప్రాంతంలో మొసలి

ప్రజాశక్తి-కొత్తపట్నం

మండలంలోని వజ్జిరెడ్డిపాలెం గ్రామ సముద్ర తీరానికి అరుదైన మొసలి వచ్చింది. స్థానికులు ఈ విషయాన్ని మత్స్యశాఖ అధికారులకు తెలియజేశారు. మత్స్యశాఖ అధికారి ఏ చంద్రశేఖరరెడ్డి సంఘటన స్థలానికి వచ్చి.. మొసలిని పరిశీలించారు. మత్స్యశాఖ అధికారులు, జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం ఆధ్వర్యంలో ఫారెస్ట్ అధికారులకు తెలియజేసి ఈ మొసలిని ఫారెస్ట్ అధికారులకు అప్పగించినట్లు జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం అధ్యక్షులు వాయిల శ్రీనివాసరావు తెలియజేశారు.



మత్స్యకారులు పట్టుకున్న మొసలి

పసిడి పంటలతో

ప్రగతికి బంగారు బాటలు వేయాలి

లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ

ప్రజాశక్తి-బాపట్ల



మాట్లాడుతున్న జయప్రకాష్ నారాయణ

వ్యవసాయ రంగంలో వినూత్న ఆవిష్కరణలకు తెరదీసి అత్యుత్తమ పరిశోధనా ఫలితాలతో ప్రపంచానికి నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించే దిశగా వ్యవసాయ విద్యార్థులు పసిడి పంటలతో ప్రగతికి బంగారు బాటలు వేయాలని లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ అన్నారు. మంగళవారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో జరిగిన కళాశాల పూర్వ విద్యార్థి కన్నెగంటి పాపారావు ఆటోబయోగ్రఫీ "విత్తనంలో విశ్వం" పుస్తకావిష్కరణ సభకు జయప్రకాష్ నారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ విద్యార్థులు సంపద సష్టికి శ్రమించాలన్నారు. హేతుబద్ధమైన పద్ధతుల ద్వారా చేపట్టే వ్యవసాయం సమాజానికి అవసరమైన వస్తు సేవల సష్టిని సాధిచడం ద్వారా వ్యవసాయాన్ని ఆదాయ వనరుగా పెంపొందింపజేయాలన్నారు. అందుకు కన్నెగంటి పాపారావు జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వ్యవసాయ విద్యను అభ్యసించినప్పటికీ, ప్రభుత్వ ఉద్యోగాన్ని కాదని స్వయంగా వ్యవసాయాన్ని చేపట్టి 'వరలక్ష్మి' బిటి పత్తి వంగడాన్ని సష్టించి పత్తి రైతుల జీవితాలకు కొత్త వెలుగును ప్రసాదించిన పాపారావు కొన్ని కోట్ల ఎకరాలకు పత్తిని విస్తరించి సంపద సష్టించి చరితార్థులయ్యారన్నారు. వ్యక్తి కంటే వ్యక్తి ఆదర్శాలు, ఔన్నత్యం ముఖ్యం. తాను సంపాదించుకోవడమేకాక సాటి రైతులకు కూడా వ్యవసాయ సంపద పట్ల అవగాహన కల్పించారన్నారు. సభకు అధ్యక్షత వహించిన వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఒక వ్యక్తి తన చుట్టూ ఉన్న సమాజాన్ని ఏవిధంగా ప్రభావితం చేయగలరో పాపారావు జీవితమే నిదర్శనమన్నారు. ఆలమ్ని అగ్రికల్చరల్ గ్రాడ్యుయేట్స్ ట్రస్ట్ ఫర్ కాలేజ్ డెవలప్మెంట్, కన్నెగంటి కుటుంబ సభ్యులు నిర్వహించిన కార్యక్రమంలో ప్రాణాధార ఫౌండేషన్ డైరెక్టర్ పుండరీకాక్షుడు, గోరంట్ల శాంతారామ్, విశ్రాంత డిజి, ఏపిపిఎస్‌సి మాజీ చైర్మన్ వి అప్పారావు, బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి మానం నాగేశ్వర రావు, పుస్తక రచయిత్రి అరుణ పప్పు, విశ్రాంత ఐపిఓఎస్ కన్నెగంటి సంధ్యారాణి, కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల వారికీ అండగా ఉంటాం..

టిడిపి కూటమి బాపట్ల అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల



టిడిపిలో చేరిన వారితో వేగేశన నరేంద్రవర్మ

తెలుగుదేశం పార్టీ అన్ని వర్గాల వారికీ అండగా ఉంటుందని టిడిపి కూటమి అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మంగళవారం బాపట్ల నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి పలువురు నరేంద్రవర్మ నేతృత్వంలో టిడిపిలో చేరారు. కర్లపాలెం మండలంలోని కర్లపాలెం, పాతపాలెం ఇస్లాంపేటకు చెందిన యువకులు బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయలో పార్టీ నాయకులు పఠాన్ కరీముల్లా, పఠాన్ అహ్మద్‌బాషా ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరితో పాటు నల్లమోతువారిపాలెంకు చెందిన 30 మంది తాంధ్ర రవిబాబు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. కర్లపాలెం గ్రామం కొత్త ఊరు ఇస్లాంపేటకు చెందిన వారు నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ రఫీ ఆధ్వర్యంలో టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వీరందరినీ నరేంద్ర వర్మ పార్టీలోకి ఆహ్వానించారు.

మహిళా సమస్యల పరిష్కారంపై

పార్టీలు విధానం ప్రకటించాలి..

- ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి - మల్లు స్వరాజ్యంకి ఘన నివాళి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలూ మహిళా సమస్యల పరిష్కారంపై వారి విధానం ప్రకటించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి డిమాండ్ చేశారు. తెలంగాణ పోరాట యోధురాలు, మహిళా ఉద్యమ నేత మల్లు స్వరాజ్యం ద్వితియ వర్ధంతి సభను స్థానిక సత్యనారాయణపురంలో మంగళవారం నిర్వహించారు. తొలుత మల్లు స్వరాజ్యం చిత్రపటానికి ఐద్వా నగర కార్యదర్శి జి.ఆదిలక్ష్మి పూలమాల వేసి.. నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి ఐద్వా నాయకులు జి.కళ్యాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కంకణాల రమాదేవి. మాట్లాడుతూ మహిళలు సనాతన సాంప్రదాయాలకు కట్టుబడి ఇంటి నుండి బయటకు రాలేని స్థితిలో ఆయుధాలు పట్టి, సాయుధ పోరాటంలో నిలిచిన వీరమాత మల్లు స్వరాజ్యం అని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టి, గ్రామీణ పేదలు, రైతుకూలీల హక్కుల కోసం సాయుధ పోరాటంలో నిలిచారని, ఫలితంగా లక్షలాది ఎకరాల భూములు పేదలకు దక్కాయన్నారు. రైతు కూలి ఉద్యమాలే కాక ప్రత్యేకంగా ఆంధ్రప్రదేశ్ మహిళా ఉద్యమ నిర్మాణంలో మల్లు స్వరాజ్యం ప్రముఖ పాత్ర పోషించిందని తెలిపారు. ఆమె వర్ధంతి సందర్భంగా మహిళా సమస్యలపై ఒక మేనిఫెస్టోను ఐద్వా విడుదల చేస్తుందన్నారు. ఆ మేనిఫెస్టోను అన్ని రాజకీయ పార్టీలు చర్చించి మహిళా సమస్యలపై వారి విధానం ప్రకటించాలని డిమాండ్ చేశారు. మేనిఫెస్టోలో ఉన్న వివరాలను ఆమె తెలుపుతూ అత్యాచార నిందితులను ఫాస్ట్ ట్రాక్ కోర్టుల ద్వారా 90 రోజుల్లో విచారణ జరిపి కఠిన శిక్ష విధించాలని, పెరిగిన కేసులకు అనుగుణంగా కోర్టుల సంఖ్య పెంచాలని కోరారు. మహిళల భద్రత, రక్షణ లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మీడియా మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని, హింస, అశ్లీలత, అసమానతలను ప్రేరేపించే చలనచిత్రాలు, టీవీ సీరియల్స్, ఇంటర్నెట్ కార్యక్రమాలను నిషేధించాలన్నారు. మద్యం, మత్తు పదార్థాల నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని కోరారు. 14 రకాల నిత్యవసర సరుకులను చౌక ధరల దుకాణాల ద్వారా పేదలకు అందించాలని కోరారు. బాలల సంరక్షణకు అన్ని రకాల చర్యలు చేపట్టాలని, బాల్యవివాహాల నిరోధానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళలకు విద్య, ఆరోగ్యం, రక్షణ, రవాణా, ఉపాధి భద్రత కల్పించేందుకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. సమానత, శాస్త్రీయత పునాదిగా విద్యా విధానాన్ని రూపొందించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటువంటి అనేక అంశాలు మేనిఫెస్టోలో ఉన్నాయని, రానున్న ఎన్నికల్లో దీనిపై చర్చ చేస్తామని, వీటి సాధన కోసం అన్ని రాజకీయ పార్టీలపై ఒత్తిడి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు పి.పద్మ, కె.కమల పి.నాగమణి, ఎం.ఉషారాణి, కె.కోటేశ్వరమ్మ, ఎన్.హరిణి, వి.విజయలక్ష్మి, పి.భారతి, ఏ.సత్యవతి, పి.సుజాత పాల్గొన్నారు.